# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఇళ్ల వద్దే వ్యర్థాల సేకరణ చేపడుతున్న "స్వచ్ఛ రథాలు" గ్రామీణ స్థాయిలో శాస్త్రీయ వ్యర్థ నిర్వహణను బలోపేతం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. గ్రామాల వారీగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించడం అవసరమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

**3. తెలంగాణలో రైల్వే అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.**

**4. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా ఇంధన పొదుపును ప్రాధాన్యత అంశంగా తీసుకుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.**

==========================

ఇళ్ల వద్దే వ్యర్థాల సేకరణ చేపడుతున్న "స్వచ్ఛ రథాలు" గ్రామీణ స్థాయిలో శాస్త్రీయ వ్యర్థ నిర్వహణను బలోపేతం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. అలాగే, వ్యర్థాల వర్గీకరణలో సాంకేతికత వినియోగం పెరగడంతో పనితీరు మెరుగుపడటమే కాకుండా, కార్మికుల జీవనోపాధికి దోహదపడుతోందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రాసెసింగ్ కు అనుకూలంగా మలచి విలువైన వనరుగా రూపొందించవచ్చని పేర్కొన్నారు. పరిసరాలను శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో స్వచ్ఛత సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.

--------------------------

గ్రామాల వారీగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించడం అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై నిన్న నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండలంలో కనీసం ఒక విత్తన గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామ సభల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో ఉన్న లక్షా 20 వేల రైతులు, 30 వేల కౌలు రైతులకు అవసరమైన సమాచారం చేరేలా సమర్థవంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో

యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసి రైతులకు నిరంతర అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

--------------------------

తెలంగాణలో రైల్వే అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ ఉప్పుగూడ రైల్వేస్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో రాష్ట్రంలో 347 కిలో మీటర్ల నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రెండోదశలో భాగంగా నగరం నుంచి యాదగిరిగుట్ట వరకు పొడిగించనున్నట్లు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ను 26 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పనులను డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అంతకుముందు మలక్ పేట రైల్వేస్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు.

--------------------------

కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా ఇంధన పొదుపును ప్రాధాన్యత అంశంగా తీసుకుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 'కోటి సూర్యఘర్ కనెక్షన్లు' లక్ష్యంగా పెట్టుకోగా, రాష్ట్రంలో 20 లక్షల కనెక్షన్ల సాధనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 6 లక్షల పిఎం సూర్యఘర్ సోలార్ యూనిట్లు ఉచితంగా పేదలకు అదించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు మంత్రి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

పేద ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఉచితంగా ఇంటర్ విద్య అందించేందుకు 'తాలీమ్-ఏ-హునర్' కార్యక్రమంలో భాగంగా ప్రవేశ పరీక్షను ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. పరీక్ష సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ముస్లిం కుటుంబాలకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణులై ప్రతిభ కలిగిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ఇంటర్ విద్య అందించడం ఈ పథకం లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులు నీట్, ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముందని తెలిపారు.

--------------------------

సవర గిరిజన చిత్ర లేఖనం రాష్ట్రంలో గిరిజన సంప్రదాయ కళల్లో ఒక విశిష్ట రూపమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ కళకు మరింత గుర్తింపు తీసుకురావడంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ -- ఐటిడిఎ చేస్తున్న కృషిని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందించారు. ఇలాంటి హస్తకళా ఉత్పత్తుల ద్వారా గిరిజన కళలకు విస్తృత ప్రాచుర్యం లభించడం మాత్రమే కాకుండా, గిరిజన కళాకారుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. సంప్రదాయ సవర కళతో అలంకరించిన హస్తకళా జాకెట్‌ను శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట పర్యటనలో కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. తూర్పు కొండ ప్రాంతానికి చెందిన సవర గిరిజన తెగ ప్రత్యేకతను ప్రతిబింబించే ఈ కళారూపం వారి జీవన విధానం, సంస్కృతిని

ప్రతిఫలింపజేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన 'వికసిత భారత్', ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్న 'స్వర్ణాంధ్ర' సాధనలో నాణ్యమైన మానవ వనరుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలైన అమృత్, జల్ జీవన్ మిషన్, పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ వంటి కీలక కార్యక్రమాల అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ..

వాయిస్..27 సెకన్లు

-------------------------

చేనేత కార్మికులకు ఏడాదంతా ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. గత రెండేళ్లలో చేనేత రంగాన్ని బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేత కార్మికులను ప్రోత్సాహించేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ అవకాశాలు పెంచేందుకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. గత నెల నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకంతో నేతన్న కుటుంబాలకు మరింత లాభం చేకూరుతోందని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందిచడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

-------------------------

నైరుతి రుతుపవనాలు ఈ నెల 26వ తేదీ నాటికి 4 రోజులు ముందుగా లేక ఆలస్యంగా కేరళంలో ప్రవేశించే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతంతో విలీనమైందని వెల్లడించింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్.నారాయణ పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడిం చింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని పేర్కొంది.

=====================